ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
చిత్తూరు
జిల్లా వార్తలు
గురువారం 6 నవంబరు 2025



పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం


చిత్తూరు అగస్త్యేశ్వరాలయం

దీపోత్సవం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు పగలంతా శివనామస్మరణతో మార్మోగాయి.సాయంత్రం దీపోత్సవాలతో కళకళలాడాయి. పూజలు,ఉపవాసాలతో మహిళలు ఆలయాలకు చేరుకుని దీపోత్సవాల్లో పాల్గొన్నారు.ఇండ్ల ముందు కూడా ఆవునెయ్యితో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కాణిపాకంలోని మణికంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్టు వద్ద పిండి దీపాలను వెలిగించారు. - చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి


చిత్తూరు కాశీ విశ్వేశ్వరాలయం






కాణిపాక మణికంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్టు వద్ద పిండి దీపాలను వెలిగిస్తున్న భక్తులు- రామకుప్పం కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తుల సందడి - పుంగనూరు సోమేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణం - వెదురుకుప్పంలో కొండ మల్లీశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక దీపం

- రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆలోచనలో మార్పు
- ఇంకా పరిశీలనలోనే మదనపల్లె జిల్లా
- నగరి తిరుపతిలోకి మారడం ఖాయం



పుంగనూరుకు బదులు పీలేరు

చిత్తూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరుకు బదులు పీలేరు కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు క్యాబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జిల్లాల పునర్విభజన, నూతన రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ బుధవారం రాజధానిలో సమావేశమైంది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మార్పు చేర్పుల గురించి చర్చించింది.ఇటీవల సీఎం చంద్రబాబుతో సబ్ కమిటీ సమావేశమై ప్రాథమిక ప్రతిపాదనల్ని ఆయన ముందుంచింది. ఆయన చేసిన సూచనలతో ప్రతిపాదనల్లో మార్పులు చేసింది. గతంలో పుంగనూరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి, ఆ నియోజకవర్గంలోని ఆరు మండలాలు ఆ డివిజన్‌లో ఉంచాలని ప్రతిపాదించారు. తాజాగా పుంగనూరుకు బదులుగా పీలేరు కేంద్రంగా డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేశారు. పీలేరు సబ్ డివిజన్‌లో ఏయే మండలాలు ఉంటాయనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. పుంగనూరును మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కలుపుతూ ఆరు నెలల ముందే చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

పీలేరుకు మహర్దశ

మదనపల్లె కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు గురించి కూడా సబ్ కమిటీ చర్చించింది. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరుతో పాటు చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గాన్ని కూడా కలిపేసి జిల్లాగా ఏర్పాటు చేసే ప్రతిపాదన సిద్ధం చేశారు. దాన్ని సీఎం చంద్రబాబు ఫైనల్ చేయాల్సి ఉంది. మదనపల్లె జిల్లా అయితే నాలుగు నియోజకవర్గాలు, రెండు (మదనపల్లె, పీలేరు) రెవెన్యూ సబ్ డివిజన్లు ఉంటాయి. పోలీసు సబ్ డివిజన్లను కూడా పెంచే అవకాశాలున్నాయి. పీలేరును రెవెన్యూ డివిజన్‌తో పాటు పోలీసు సబ్ డివిజన్‌గా కూడా మార్చవచ్చు. ఇవన్నీ వచ్చినప్పుడు దీన్ని మున్సిపాలిటీగా కూడా మార్చే అవకాశాలు లేకపోలేదు.

ఈ నిర్ణయాల్లో మార్పు లేనట్టే

నగరి నియోజకవర్గం మొత్తాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలనే ప్రతిపాదనకు సీఎం ఇప్పటికే ఆమోదం తెలిపారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉన్న నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేందుకు ఇది వరకే చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా ప్రతిపాదన పంపివున్నారు.అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి రాజంపేటకు మార్చే నిర్ణయంలోనూ మార్పు లేదని తెలుస్తోంది. మదనపల్లె జిల్లాగా ఏర్పడితే అన్నమయ్య జిల్లాలో మూడు నియోజకవర్గాలు రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు మాత్రమే మిగిలి ఉంటాయి. మూడింటితోనే జిల్లా ఉంటుందా.. కడపలోని ఏదైనా ఓ నియోజకవర్గాన్ని కలిపి నాలుగు చేస్తారా అనే విషయంలో స్పష్టత లేదు.

అమరరాజా గ్రోత్ కారిడార్‌లో
సిబ్బంది చేతివాటం




పోలీసుల అదుపులో చోరీకి పాల్పడ్డ నిందితులు - స్వాధీనం చేసుకున్న 27 టన్నుల లెడ్ బుష్ విడిభాగాలు

- రూ.2.73 కోట్ల విలువైన లెడ్ బుష్ మాయం
- ఐదుగురు సిబ్బంది, స్ర్కాప్ వ్యాపారి, డ్రైవర్ అరెస్టు

యాదమరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలం మోర్దానపల్లిలో గల అమరరాజా బ్యాటరీ సంస్థలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఏకంగా రూ.2.73 కోట్ల విలువైన లెడ్ బుష్ (బ్యాటరీ విడిభాగాలను) మాయం చేసిన కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి,చోరీ చేసిన మెటీరియల్‌తో పాటు నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడి కథనం మేరకు ...అమరరాజా మొబిలిటీ గ్రోత్ కారిడార్‌లో బ్యాటరీ విడిభాగాలు మాయమయ్యాయని సంస్థ జనరల్ మేనేజర్ రూపానంద్ కుమార్ మంగళవారం రాత్రి యాదమరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, యాదమరి ఎస్‌ఐ ఈశ్వర్, సిబ్బంది బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు.బుధవారం మధ్యాహ్నం రామభద్రాపురం ప్రాంతంలో కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం బయటపడింది.ఇందుకు సంబంధించిన రూ.82 లక్షల విలువైన 27.6 టన్నుల మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మిగిలిన మెటీరియల్ అమ్మగా వచ్చిన రూ.68 లక్షలు నగదుతో పాటు రూ.1.18 కోట్ల విలువైన బంగారం రికవరీ చేశారు. ఈ దొంగతనం వెనుక సంస్థలో పనిచేసే సిబ్బంది హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ప్లాంట్ ఉద్యోగులు మహేంద్ర, గణేష్, ఢిల్లీబాబు, కృష్ణయ్య, హరితో పాటు స్ర్కాప్ కొనుగోలు చేసిన వ్యాపారి ఆరిఫ్‌ను,సరుకు తరలింపునకు సహకరించిన వ్యాన్ డ్రైవర్ బాబును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద వున్న ఒక ఐచర్ వాహనం, ఒక అశోక్ లేల్యాండ్ దోస్త్ వాహనాన్ని కూడా సీజ్ చేశారు.పూతలపట్టు మండలం పేటమిట్ట లోని మంగళ్ ఇండస్ట్రీ నుంచి అమరరాజా గ్రోత్ కారిడార్ లోని యూనిట్‌కు లెడ్ బుష్‌లను తరలించే ప్రక్రియలో పాల్గొన్న నలుగురు సిబ్బంది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు దాదాపు 91 టన్నుల లెడ్ బుష్‌ను స్ర్కాప్ వ్యాపారికి అమ్మి సొమ్ము చేసుకున్నట్లు విచారణలో తేలింది.


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

- మామిడితోటలో రోజంతా మాటు వేసిన గజరాజులు
- మామిడి, టమోటా, కాలీఫ్లవర్ పంటలు ధ్వంసం

బాలిరెడ్డిగారిపల్లె వద్ద
16 ఏనుగుల హాల్‌చల్


మామిడితోటలో ఏనుగుల మంద

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు-పీలేరు హైవే సమీపంలోని బాలిరెడ్డిగారిపల్లె వద్ద బుధవారం పగలంతా పదహారు ఏనుగుల మంద హాల్‌చల్ చేశాయి. కల్లూరు-అయ్యావాండ్లపల్లె రోడ్డుకు ఆనుకొని ఉన్న మామిడితోటలో గజరాజులు తిష్ట వేయడంతో అటవీశాఖ అధికారులు తీవ్ర ఆందోళన చెందారు.ఏనుగుల గుంపు ఉన్న మామిడితోటను సిబ్బంది చుట్టుముట్టారు. తోటలో నుంచి బయటకు రాకుండా నలువైపులా టపాకాయలు పేల్చడంతో ఏనుగులు కోపంతో ఘీంకారాలు చేశాయి. కొంతదూరం ట్రాకర్స్‌ను ఏనుగులు తరుముకుని చెమటలు పెట్టించాయి. మామిడితోట నుంచి పగటి వేళలో ఏనుగుల గుంపు బయటకు వస్తే ప్రజలకు ప్రజలకు ముప్పు వాటిల్లుతుందని గ్రహించిన రేంజర్ థామస్ సుకుమార్, ఎఫ్‌ఎస్‌వో మహమ్మద్ షఫీ తమ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ముందుగా మంగళవారం రాత్రి తూర్పు విభాగ అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి రెండు గున్న ఏనుగులతో కలిసి 16 ఏనుగుల మంద కుమ్మరిపల్లె వద్దకు చేరుకున్నాయి.రవికుమార్, ధర్మేంద్ర, బాబుకు చెందిన మామిడి, కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు పశుగ్రాసం తినేసి రాతికూసాలను విరిచేశాయి. అక్కడి నుంచి కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకున్న ఏనుగుల మంద వీకే పల్లె వద్దకు చేరుకొని రెడ్డిశేఖర్ నాయుడికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను, రాతికూసాలను విరిచేశాయి. అక్కడి నుంచి బాలిరెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లె, అయ్యావాండ్లపల్లె, యర్రంవాండ్లపల్లె వరకు వెళ్లిన ఏనుగులు పలురకాల పంటలను ధ్వంసం చేశాయి. చెరుకువారిపల్లెలో దామోదర్‌కు చెందిన పొలంలో బీభత్సం సృష్టించిన ఏనుగుల మంద టమోటా, కాలీఫ్లవర్ పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగులు మునిరెడ్డిగారిపల్లె వద్దకు చేరుకోవడంతో తెల్లారింది. బాలిరెడ్డిగారిపల్లెలో మునిరెడ్డి, మధురెడ్డి, అమరనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరుస్తూ ఘీంకారం చేయడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందారు. అప్పటికే అక్కడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు టపాకాయలు పేల్చడంతో సిబ్బందిపై అవి తిరగబడ్డాయి. దీంతో ట్రాకర్స్ ప్రాణ భయంతో పరుగులు తీశారు. కల్లూరు- అయ్యావాండ్లపల్లె రోడ్డు సమీపంలో ఉన్న సోమసుందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డికి చెందిన మామిడితోటలో ఏనుగుల మంద నిలకడగా నిలబడ్డాయి. సమాచారం అందుకున్న రేంజర్ థామస్ సుకుమార్, ఎఫ్‌ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు సిబ్బందితో హుటాహుటిన మామిడితోట వద్దకు చేరుకున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చిన అటవీశాఖ అధికారులు కల్లూరు- అయ్యావాండ్లపల్లి రోడ్డుపై ఎలాంటి వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే ప్రాంతంలో ఏనుగుల మంద సేదతీరాయి. సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్ముకొని వర్షం కురవడంతో చీకటిగా మారింది. అంతవరకు ఏనుగుల మంద సమీపంలోనే ఉన్న అటవీశాఖ అధికారులు, ట్రాకర్స్ సమీపంలోని బాలిరెడ్డిగారిపల్లెలోకి వెళ్లిపోవడంతో ఏనుగుల మంద మామిడితోటల మధ్యలోకి వెళ్లిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏనుగుల మంద గ్రామాల మధ్యలోకి రావడంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని రేంజర్ థామస్ సుకుమార్ సూచించారు. సాధారణంగా ఏనుగులు పగలంతా అడవిలో ఉంటూ రాత్రి వేళల్లో పొలాల్లోకి చేరుకొని పంటలను ధ్వంసం చేసేవన్నారు. అయితే ఏనుగుల గుంపులో రెండు గున్న ఏనుగులు ఉండడంతో బుధవారం ఉదయానికి తిరిగి అడవికి వెళ్లడం ఆలస్యమైందన్నారు. దీంతో మామిడితోటలో ఏనుగుల మంద మాటు వేశాయని రేంజర్ తెలిపారు.

గ్యాస్, ఆయిల్ ఆనవాళ్లున్నాయా?

వాకాడు,నవంబరు 5(ఆంధ్రజ్యోతి):ఆయిల్, గ్యాస్ నిక్షేపాల అన్వేషణలో భాగంగా తిరుపతి జిల్లా వాకాడు మండలం వాకాడు, గొల్లపాళెం పొలాల్లో రెండు రోజులుగా ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ పనులు చేపట్టింది.80 అడుగుల లోతులోని మట్టిని తీసి ఓఎన్‌జీసీ పరీక్షా కేంద్రానికి పంపిస్తామని, మరోవైపు అంత లోతునుంచి అయిస్కాంత తరంగాల ద్వారా ప్రత్యేక పరికరాలు భూగర్భంలోకి పంపి గ్యాస్ నిక్షేపాలు ఉన్నదీ లేనిదీపరిశీలిస్తున్నామని సంస్థ పీఆర్వో సుధీర్ వివరించారు.



శ్రీవారి సేవలో రాజు సుందరం

తమిళనటుడు, కొరియోగ్రాఫర్ రాజు సుందరం బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



మంత్రి లోకేశ్‌ను కలిసిన మిట్స్ విజయభాస్కర్

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను డీమ్డ్ టు బి మిట్స్ చాన్సలర్ ఎస్.విజయభాస్కర చౌదరి కలిశారు.అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవల డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీగా అవకాశం రావడంతో చాన్సలర్ ఎస్.విజయభాస్కర చౌదరి విజయవాడలో మంత్రిని కలిసి కళాశాలలో విద్యావిధానాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్శిటీలో అందిస్తున్న ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో తమ యూనివర్శిటీ సాధించిన పలు అంశాలు, నాణ్యమైన విద్య, అధ్యాపకుల మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు. దీంతో విజయభాస్కర చౌదరిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు.

వరదయ్యపాళెం ఎంపీపీ రాజీనామా ఆమోదం

వరదయ్యపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీపీ పద్మప్రియ రాజీనామాను ఆమోదిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఆమె స్థానంలో బొప్పన పద్మావతిని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. పలు నాటకీయ పరిణామాల మధ్య ఎంపీపీ పదవికి పద్మప్రియ రాజీనామా చేశారు. దీంతో వైస్‌ఎంపీపీ పద్మావతి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,091

తలనీలాలు సమర్పించినవారు: 21,111





వెలుగుల స్వర్ణముఖి

శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కన స్వర్ణముఖి నదిలో భక్తులు నేతి దీపాలు వెలిగించి గంగాదేవికి సమర్పించారు. దీంతో స్వర్ణముఖినదీ తీరప్రాంతం ఎటు చూసినా నేతిదీపపు కాంతులతో ఆధ్యాత్మికను సంతరించుకుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

యోగుల పర్వతంపై దీపోత్సవం



కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న ప్రతాప్‌స్వామి

వడమాలపేట మండలం బాలినాయుడుకండ్రిగ సమీపంలోని యోగుల పర్వతంపై బుధవారం దీపోత్సవం నిర్వహించారు. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు అడుగుల కొప్పెరలో 1502 కిలోల నెయ్యి ఏర్పాటు చేసిన దీపాన్ని సంస్థ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి వెలిగించారు. భక్తుల శివనామ స్మరణలతో యోగుల పర్వతం మార్మోగింది.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కపిలేశ్వరాలయానికి పోటెత్తారు



కపిలేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో బారులు తీరిన భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలోని శివాలయాలు రద్దీగా మారాయి. జలపాతాల వద్దా జనసందడి కనిపించింది. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. తిరుపతి నగరం కపిలేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రద్దీని ఊహించి టీటీడీ అధికారులు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు అన్నాభిషేకం నిర్వహించారు. అన్నంతో రూపొందించిన ఉత్సవర్లను కపిలతీర్థంలో మునక వేయించారు. ఇక, సాయంత్రం ఆలయ సమీపంలోని ఉద్యానవనంలో భక్తులు కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగించారు.

- తిరుపతి (కల్చరల్), ఆంధ్రజ్యోతి





అన్నాభిషేకమూర్తులను పుష్కరిణిలో మునక వేయిస్తున్న అర్చకులు - కపిలేశ్వరాలయం పక్కన ఉద్యానవనంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీ

- సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని తొలగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు భద్రత నడుమ ఎస్వీయూలో విద్యార్థి సంఘాలు బుధవారం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించాయి. ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యవహారం చినికి చినికి గాలివానగా మారుతోంది. ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాలు నినదించాయి. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఆర్చి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి స్వయంగా తరగతిలో కూర్చొని సీనియర్ విద్యార్థులతో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయించాడని ఆరోపించారు. ఆయన్ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులకు చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీల కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఆశ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, లా విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుందరరాజు, జీఎస్ఎస్ నేత శివశంకర్ నాయక్, జేబీఎస్ఎఫ్ కన్వీనర్ భార్గవ్, పవిత్ర, అనిత, తిరుమలేష్, షేక్‌షా, మన్సూర్, చందు నాయక్, తిప్పేస్వామి, ఆదిత్య, అభిషేక్, ఇమ్రాన్ పాల్గొన్నారు.



ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన

సీసీ టీవీ ఫుటేజీలు చూపండి

- బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు

ర్యాగింగ్ వ్యవహారంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గొంతు విప్పారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ చూపించాలని కోరారు.

ముగిసిన విచారణ

సైకాలజీ విభాగంలో చోటు చేసుకున్న ర్యాగింగ్ వ్యవహారంపై ఏర్పాటు చేసిన కమిటీ విచారణ ప్రక్రియను పూర్తి చేసింది. యూనివర్సిటీ అధికారులకు నివేదికను సమర్పించింది. దాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి యూనివర్సిటీ అధికారులు పంపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశముంది.

కరుడు కట్టిన స్మగ్లర్ అరెస్టు

- కారు సహా ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కరుడు కట్టిన ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. రేంజ్ ఆఫీసర్ కథనం మేరకు.. తిరుపతి - అన్నమయ్య జిల్లా సరిహద్దు గ్రామం పింఛా నుంచి చెన్నైకు ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందని రహస్య సమాచారం ఉంది. దీంతో ఉస్తికాయలపెంటలో తమ సిబ్బంది నిఘా ఉంచారు. బుధవారం వేకువజామున పింఛా నుంచి ఎల్లమంద వైపు అతివేగంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా అతివేగంగా వెళుతూ ఎల్లమంద ఎస్సీ కాలనీ వద్ద కల్వర్టును ఢీకొని ఆగిపోయింది. ఈ క్రమంలో కారులో వున్న వ్యక్తిని పట్టుకొని, కారును పరిశీలించగా 114 కేజీల బరువున్న 5 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. నిందితుడిని విచారించగా 2022 ఫిబ్రవరి 6వతేదీన కేవీ పల్లె మండలంలో కారుతో గుద్దడంతో టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ గాయపడి చనిపోయిన కేసులో నిందితుడిగా తేలిందని ఎఫ్ఆర్వో వెంకట్రమణ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడుకు చెందిన రామన్ చిన్నయ్యన్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడిలో అధికారులు మునస్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, రాజేష్, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారన్నారు.

తిరుమలలో అస్వస్థతకు గురైన మహిళ మృతి



మృతి చెందిన మహిళ

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ఆదివారం అస్వస్థతకు గురైన ఓ మహిళ మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. 40 ఏళ్ల వయస్సు కలిగిన మంగ అనే మహిళ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో మూర్ఛతో కుప్పకూలిపోయింది. 108 అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందినట్టు బుధవారం ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు. పేరు తప్ప ఆమె వివరాలేవీ తెలియదని పేర్కొన్నారు. మృతదేహన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 94407 796768 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఎలక్ట్రీషియన్లకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇతర సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రీషియన్లకు జర్మనీలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ లేదా డిప్లమో చేసి, 30ఏళ్ల లోపు వారు అర్హులని వెల్లడించారు. కనీసం రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలని తెలిపారు. ఈ నెలలో రాజమండ్రిలో జర్మనీ భాషపై అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9160912690ను సంప్రదించాలని కోరారు.

ట్రేడింగ్ యాప్ పేరుతో రూ.1.50 కోట్లు కొట్టేశారు

తిరుపతి (నేరవిభాగం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ట్రేడింగ్ యాప్ పేరుతో రూ.1.50 కోట్లు కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ సీఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని డీమార్ట్ సమీపంలో ఉంటున్న చైతన్య కుమార్, వెంకటేష్ కువైట్‌కు వెళ్లి కొంత డబ్బు సమకూర్చుకుని వచ్చారు. ఇక్కడ ఆన్‌లైన్ వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ ద్వారా ఒక గుర్తు తెలియని వ్యక్తితో వీరికి పరిచయమైంది. అంగారి ట్రేడ్ యాప్‌లో పెట్టుబడిపెడితే రెండింతలు లాభాలు వస్తాయని సదరు వ్యక్తి చెప్పి నమ్మించాడు. దీంతో వారు కోటి రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఎంతసేపు చూసినా డబ్బు అకౌంట్లో పడకపోవడంతో సదరు వ్యక్తికి ఫోన్ చేశారు. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయాయని గుర్తించి తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11, 12 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీస్ క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్, షటిల్, బాడ్మింటన్, చెస్, లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్‌టెన్నిస్, కబడ్డీ, క్యారం, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, క్రికెట్, వెయిట్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్‌ఫిసిక్స్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, డ్యాన్స్, మ్యూజిక్ సంబంధించి పోటీలు ఎస్వీ తారకరామ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైనవారు ఈనెల 19నుంచి 22వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని, మరిన్ని వివరాలకు 9059606346, 9966882029లను సంప్రదించాలని కోరారు.

9 మంది స్మగ్లర్ల అరెస్టు

- 20 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి అటవీ పరిధిలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్ఎస్ఐ ఈశ్వరరెడ్డి బృందం శ్రీకాళహస్తి అటవీ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా బుధవారం తెల్లవారుజామున రాగిగుంట సెక్షన్, తీర్థాల పాలకోనలో కొంత మంది వ్యక్తులు గుమికూడి ఉండటాన్ని గమనించారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి తొమ్మిది మందిని పట్టుకున్నారు. పరిసర ప్రాంతాల్లో దాచి ఉంచిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో ఇద్దరు తిరుపతి జిల్లా, ఏడుగురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మీరూ రాష్ట్రానికి వచ్చి

వైద్యసేవలు అందించండి

- లండన్‌లో స్విమ్స్ మాజీ వైద్యుడికి సీఎం చంద్రబాబు సూచన



సీఎం చంద్రబాబును కలిసిన డాక్టర్ కళ్యాణ్

తిరుపతి(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'మీ తండ్రి గుడారు జగదీష్ గతంలో.. ఇప్పుడు బర్డ్ ఆస్పత్రిలో చక్కటి వైద్యసేవలను అందిస్తున్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని మీరు స్వదేశానికి వచ్చి మన రాష్ట్ర ప్రజలకు వైద్యసేవలు అందించండి. 'మీలాంటి అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు ఎంతో అవసరం' అంటూ లండన్‌లో స్థిరపడ్డ స్విమ్స్ మాజీ వైద్యుడు డాక్టర్ గుడారు కళ్యాణ్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. లండన్ పర్యటనకు వెళ్లిన సీఎం నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులను గతంలో స్విమ్స్‌లో పనిచేసిన వైద్యుడు, లండన్ కింగ్స్ అండ్ గయ్స్ హాస్పిటల్లోని కిడ్నీ వైద్య విభాగాధిపతి డాక్టర్ గుడారు కళ్యాణ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్‌లో అందిస్తున్న వైద్యసేవలు, అధునాతన వైద్యపద్ధతులను, అక్కడి కళ్యాణ్ అనుభవాల గురించి సీఎం చంద్రబాబునాయుడు అడిగి తెలుసుకున్నారు. లండన్‌లో అందుబాటులో ఉన్న రోబోటిక్ అధునాతన వైద్య పద్ధతులను ఆయన సీఎంకు వివరించారు.



రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సైన్స్ డ్రామాలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయి

- డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సైన్స్ డ్రామాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం సౌజన్యంతో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్‌డ్రామా పోటీలు తిరుపతి పద్మావతి బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై అవగాహన పెంచుకుని సృజనాత్మకంగా ఆలోచించి పరిష్కారాలు తెలుసుకునేలా సైన్స్ డ్రామాలు విద్యార్థులను తీర్చిదిద్దుతాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. తిరుపతి ఎస్‌కేఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన మోక్షజ్ఞ బృందం ప్రదర్శించిన 'బెనిఫిట్ ఆఫ్ మ్యాన్ కైండ్' మొదటి బహుమతి, ఎస్జీఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన హారిక బృందం ప్రదర్శించిన 'స్మార్ట్ అగ్రికల్చర్' డ్రామా రెండవ బహుమతి గెలుచుకున్నాయి. ఇవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వీటితో పాటు ఎస్వీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన 'క్లీన్లీనెస్' తృతీయ, 'స్మార్ట్ అగ్రికల్చర్' ప్రదర్శన నాల్గవ స్థానాల్లో నిలిచి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. ప్రథమ బహుమతికి రూ.1000, ద్వితీయకు రూ.750, తృతీయకు రూ.500, నాల్గవ బహుమతిగా రూ.250 నగదు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పద్మావతి బాలికల పాఠశాల హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ ఎక్స్‌పోలో కమిషనర్

తిరుపతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్పెయిన్‌లో జరుగుతున్న ప్రపంచ స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పోలో తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. స్పెయిన్‌లోని బార్సిలోనా పట్టణంలో ప్రపంచ స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్‌పోకు మౌర్యతోపాటు ఏపీ తరఫున రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, విశాఖపట్నం కమిషనర్ కేతన్ భార్గవ్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ ఎక్స్‌పో జరుగుతుంది.



కార్తీక పౌర్ణమి గరుడసేవ



తిరుమల క్షేత్రంలో బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణలు, కర్పూర హారతుల నడుమ గరుడవాహన సేవ కనులపండువగా జరిగింది. కార్తీక మాసంలోని పౌర్ణమి కావడంతో ఈ గరుడ వాహన సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆది దేవుడికి వైభవంగా అన్నాభిషేకం



సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి గ్రామోత్సవంలో ఈవో, ఉభయదారులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. కాణిపాకానికి చెందిన దివంగత సల్లాసుబ్బరాయులుశెట్టి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. స్వామి వారి విగ్రహాన్ని అన్నంతో కప్పి వివిధరకాల పండ్లు,పూలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం అలంకార మండపం వద్ద ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో యువకులు డప్పులకు లయబద్ధంగా నృత్యాలుచేశారు. గ్రామోత్సవంలో కాణిపాకానికి చెందిన భక్తులు స్వామికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, ఉభయదారులు పాల్గొన్నారు.

మణికంఠేశ్వరాలయంలో జ్వాలా తోరణం



ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న ఈవో కిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాక క్షేత్రంలోని మరగదాంబిక సమేత మణికంఠేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం సహస్ర దీపాలను వెలిగించారు. పెద్ద ప్రమిదలో నేతి దీపాలను వెలిగించి ఆలయ ప్రదక్షిణగా ఈవో, ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, ఆలయ సిబ్బంది తీసుకొచ్చారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆలయ ఆవరణలో ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్ ఆధ్వర్యంలో జ్వాలా తోరణం వెలిగించారు.ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీ4 స్ఫూర్తితో పాడి ఆవుల వితరణ



పాడిఆవులను అందిస్తున్న దాతలు

చిత్తూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 విధానం స్ఫూర్తితో మద్యం దుకాణ యజమానులు బుధవారం పాడి ఆవులను వితరణగా ఇచ్చారు. గుడిపాల మండలం రాసనపల్లెలో కొంతమంది సారా తయారీ, అమ్మకాన్ని జీవనాధారం చేసుకున్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ అధికారులు సమావేశాలు నిర్వహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, సారా తయారీ వృత్తిని మానుకోవాలని సూచించారు. ఇందుకు కొంతమంది మద్యం దుకాణయజమానులు సహకరించారు. గుడిపాల మండలం రెట్టగుంటకు చెందిన శ్రీలేఖ వైన్స్ యజమాని శివరామకృష్ణ రాసనపల్లెలో అరుణ్ కుమార్, చిట్టిబాబులకు రెండు పాడిఆవులను అందించారు. శ్రీరాయల్ వైన్స్ యజమాని దిలీప్ కుమార్ ఇరువారంలో ఈయన అనంత్‌రాజ్ అనే యువకునికి పాడి ఆవును ఉచితంగా అందించారు.

రుణ ఆధారిత పథకాలపై అవగాహన పెంచుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

చిత్తూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రుణ ఆధారిత పథకాలపై అవగాహన పెంచుకున్నప్పుడే యూనిట్లను సమర్థవంతంగా నడపగలుగుతారని మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు చెప్పారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో ఉపాధి పథకాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన యువత నుంచి సలహాలు, సూచనలతోపాటు అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉద్యోగ, ఉపా ధి, నైపుణ్యాభివృద్ధి, రుణ ఆధారిత పథకాలు, అర్హతా ప్రమాణాలు, దరఖాస్తు విధానం గురించి అధికారులు వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏవో ఫిర్యాదుతో ఇద్దరు జర్నలిస్టులపై కేసు

చిత్తూరు , నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కల్గించారంటూ వెదురుకుప్పంలో ఇద్దరు జర్నలిస్టులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వ్యవసాయాధికారి వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఈ కేసు నమోదు చేశారు. తన విధులకు అడ్డంకులు సృష్టించడం,ఒత్తిడి తేవడం, బెదిరించడం జరుగుతోం దంటూ జర్నలిస్టులు గోవిందు, సురేష్‌రెడ్డిపై వ్యవసాయాధికారి వనిత ఫిర్యాదు చేశారు.

ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు

చిత్తూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యల పరిష్కారంపై ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన బస్సు యాత్ర బుధవారం చిత్తూరు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘ నేతలు, విద్యార్థులు స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ధర్నాలో శివారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. దీనిపై గత అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ ప్రకటన కార్యరూపం దాల్చలేదన్నారు. రాష్ట్రంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడినన్ని గదుల్లేవన్నారు. సరైనా మరుగుదొడ్లు కూడా లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మెటిక్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. జూనియర్, డిగ్రీ, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. బస్సు యాత్ర ముగింపు సభ. ఈ నెల 12న అనంతపురంలో జరుగుతుందన్నారు. ధర్నాలో ఆ సంఘ తమిళనాడు శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలరాజు, నాసర్, నేతలు మస్తాన్, నాగభూషణం, ప్రవీణ్‌కుమార్,అభి, సీపీఐ నేతలు మణి, గోపినాథ్, దాసరి చంద్ర, విజయ్‌కుమార్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

20లోగా బిల్లులు చెల్లించకుంటే ఆందోళన తీవ్రతరం

- మామిడి సంక్షేమ సంఘం హెచ్చరిక



రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతుసంఘం నాయకులు

గంగాధరనెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మామిడి టన్నుకు రూ.4వేల వంతున చెల్లించి మాటనిలబెట్టుకుంటే పల్ప్‌ఫ్యాక్టరీల నిర్వాహకులు మాత్రం టన్నుకు రూ.8వేలు జమచేయడంలో జాప్యం చేస్తున్నారని జిల్లా మామిడి సంక్షేమసంఘం నాయకులు హరిబాబు చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 గొల్లపల్లె జైన్‌ఫ్యాక్టరీ వద్ద బుధవారం పలువురు మామిడి రైతులతో కలిసి జిల్లా మామిడి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 లోపు ఫ్యాక్టరీ నిర్వాహకులు మామిడికాయల బిల్లులు చెల్లించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జైన్‌ఫ్యాక్టరీ మేనేజర్ దిలీప్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడుతూ తమఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి వీలైనంత త్వరగా రైతులకు బిల్లులు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మామిడి రైతుసంఘం నాయకులు ఆనంద నాయుడు, సుకుమార్ నాయుడు, గోవిందస్వామి నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబునాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను

సందర్శించిన కేంద్ర బృందం



కుప్పంలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వాస్పత్రిలో నడుస్తున్న టాటా సంజీవిని, డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను బుధవారం సీఆర్ఎం, కేంద్ర బృందం సందర్శించింది. ఈ సెంటర్‌తో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. గుండె వ్యాధి, క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు చేస్తున్న సేవల రికార్డులు పరిశీలించారు. అలాగే మతా శిశు సంరక్షణ, గర్భిణులకు అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి ఆయా అంశాలలో జరుగుతున్న సేవలను గురించి ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని వివిధ వార్డులను తనిఖీ చేశారు. వైద్య పరికరాలు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ వైద్య బృందం, ప్రభుత్వ ఆస్పత్రి వైద్య బృందంతో సమావేశమై ఆయా పరిధిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం డాక్టర్ సతీశ్ కుమార్ డాక్టర్ ఎల్‌బీఎస్‌హెచ్.దేవి, డాక్టర్ నిర్మల గ్లోరీ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌వో గంగాదేవి, కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంటు విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

గజబాధితులకు పరిహారం



అందుకున్న చెక్కులను చూపుతున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే మురళి మోహన్ అన్నారు. బుధవారం యాదమరి మండలంలో ఏనుగుల దాడిలో పంటనష్టపోయిన 130 మంది రైతులకు రూ.7 లక్షల మేర పరిహార చెక్కులను ఆయన అందజేశారు. నియోజకవర్గానికి చెందిన 16 మంది లబ్దిదారులకు రూ.10.36 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందని చెప్పారు. ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు

చిత్తూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. బీఎస్ఆర్ పేట పోలీసుల కథనం మేరకు .... చిత్తూరు రూరల్ మండలం ఐనవేడుకు చెందిన కార్తీక్ ద్విచక్ర వాహనంపై చిత్తూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో క్రిష్ణపురం గ్రామానికి చెందిన యశ్వంత్(23) అనే యువకుడు బైకుతో అతడ్ని ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యశ్వంత్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్తీక్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు

తిరుత్తణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందగా బాలిక సహా ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరానికి చెందిన కాశయ్య (52) ఓ షుగర్ ఫ్యాక్టరీలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తిరువళ్లూరు జిల్లా పాండ్రవేడు గ్రామంలో ఉన్న తన బంధువు ఇంటికి తన సోదరుడి కుమార్తె మీనాక్షి, అత్త లలితమ్మను తన బైక్‌పై తీసుకెళ్లాడు. తిరిగి వస్తుండగా అదుపుతప్పిన బైక్, రోడ్డుపక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను ఢీకొనింది. ఈ ప్రమాదంలో కాశయ్య అక్కడికక్కడే మృతిచెందగా, మీనాక్షి, లలితమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఈ ఘటనపై పొదటూర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు 11న ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీసులుగా పనిచేసేందుకు గత నెలలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 11న ఇంటర్వ్యూలు జరుగుతాయని జోనల్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ అడ్రసు, ఇతర పూర్తి వివరాలను వారి ఈమెయిల్స్‌కు పంపామన్నారు.

రామకుప్పంలో మళ్లీ గజభయం



ఏనుగులు తొక్కేసిన వరిపైరు

రామకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీప్రాంత ప్రజలకు మళ్లీ గజభయం ప్రారంభమైంది. గత రెండు నెలలుగా అడవికే పరిమితమైన ఏనుగులు ప్రస్తుతం అటవీ సరిహద్దుల్లో సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి జంట ఏనుగులు పీఎంకేతండా సమీప పొలాల్లో హల్‌చల్ చేశాయి. చంద్రశేఖర్‌నాయక్, కృష్ణానాయక్‌లకు చెందిన వరి పొలాల్లో సంచరిస్తూ పంటను ధ్వంసం చేశాయి. రామకుప్పం అడవుల్లో రెండు జంట ఏనుగులు ఉన్నాయని అటవీ విభాగాధికారి హరికుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి వాటిలో ఓ మంద పీఎంకేతండా సమీప పొలాల్లో సంచరించాయని, తమ సిబ్బంది, ట్రాకర్లు వాటిని అడవిలోకి తరిమేశారన్నారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగులు పంటల వైపు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుప్పం పురపాలక సంఘానికి మహర్దశ



కాలువ నిర్మాణానికి భూమిపూజ

కుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘానికి మహర్దశ ప్రారంభమైందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్ బాబు అన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధానమైన మురుగు కాలువ రాజు కాలువను తొలగించి పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు చేపట్టడానికి వారు మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఈ పనులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుప్పం పురపాలక సంఘాన్ని మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టి సంకల్పంతో ఉన్నారన్నారు. ఇప్పటికే అభివృద్ధి పనుల కోసం రూ.92.5 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు జిమ్ దాము, సురేశ్ గణపతి, క్లస్టర్ ఇన్‌చార్జి, కౌన్సిలర్ సోము, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లావణ్య కుటుంబ సభ్యులకు పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఓ యువకుడి వేధింపులు భరించలేక లావణ్య అనే విద్యార్థిని మూడురోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం మృతురాలి స్వగ్రామం చల్లావారిపల్లెకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారప్పల్లెకు చెందిన హేమరాజ్ వేధింపుల కారణంగా తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారిని ఓదార్చారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. ఏఎంసీ చైర్మన్ రాజన్న, నాయకులు మురహరిరెడ్డి, శ్రీరాములు, చలపతి, నాగిరెడ్డి, సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, శంకర్, హరినాథ్, నేమురాజు, మణి, చంద్ర, భూపతి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో భవాని

పెద్దపంజాణి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసనంపల్లె, ముత్తుకూరు, శివాడి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను పలమనేరు ఆర్డీవో భవాని బుధవారం తనిఖీ చేశారు. వాటి భద్రతపై తగు సూచనలిచ్చారు. ఇప్పటి వరకు మండలంలో 25 పంచాయతీలకు 40 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్ల సంఖ్య పెరగడంతో మరో 3 కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేస్తున్నామని ఆమె తెలిపారు. తహసీల్దారు హనుమంతు, వీఆర్వో రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా రామకుప్పం నేతలు



కృష్ణానాయక్, జయశంకర్

రామకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెవెన్యూ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా రామకుప్పం మండలం పీఎంకే తాండాకు చెందిన కృష్ణానాయక్, గోవిందపల్లెకు చెందిన జయశంకర్ నియమితులయ్యారు. కృష్ణానాయక్ గతంలో ఉమ్మడి పంద్యాలమడుగు సర్పంచిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. జయశంకర్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులుగా తమను నియమించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు ఇతర నియోజకవర్గ, మండల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీలతోపాటు అన్నివర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఏపీఎస్‌పీఆర్‌ఈజీఎంఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం



పలమనేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రభుత్వ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా పలమనేరు డీఈ కార్యాలయంలో పనిచేస్తున్న పి.బాలసుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంఘ అధ్యక్షురాలిగా భవ్యశ్రీని ఎంపిక చేసినట్లు తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘ నాయకులు నాగరాజు, కిరణ్, మురళి, భార్గవ్, రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చినబాబు, కోశాధికారి ఎస్.కె.నూర్‌బాషా, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నబీ అహ్మద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ డేగల ప్రభాకర్

పలమనేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని.. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ సూచించారు. బుధవారం పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను ఓపన్ చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రోడ్డు భద్రత, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఎదుర్కోవాల్సిన శిక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మురళీమోహన్, మహిళా ఎస్ఐ స్వర్ణతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

13న ద్విచక్రవాహనం వేలం

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 13వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ద్విచక్రవాహనం (బజాజ్ డిస్కవరీ) బహిరంగ వేలం వేయబడుతుందని ఎక్సైజ్ సీఐ మాధవస్వామి తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో పది శాతం ధరావతు సొమ్మును చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలంలో పాల్గొనాలని సీఐ కోరారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

● శివనామస్మరణలతో మారుమోగిన శైవక్షేత్రాలు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు



రామకుప్పంలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి



పెద్దపంజాణిలో పంచముఖ ఆంజనేయస్వామి



రామకుప్పం కాశీవిశ్వేశ్వరాలయంలో వెలిగిస్తున్న కార్తీకదీపం



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న వెంకటరమణస్వామి



పుంగనూరులోని వెంకటరమణస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



చౌడేపల్లె: మృత్యుంజయేశ్వరస్వామికి పూజలు



రొంపిచెర్ల సిద్దేశ్వర ఆలయంలో కల్యాణోత్సవం

పుంగనూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా పుంగనూరు మండలంలోని శైవక్షేత్రాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం, జ్వాలాతోరణ కార్యక్రమాలు బుధవారం జరిగాయి. పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన రాతి ధ్వజస్తంభంపై ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం దీక్షితులు, రామచంద్ర దీక్షితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆకాశ కార్తీక దీపాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కాశీవిశ్వేశ్వరస్వామి పంచముఖ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. బజారువీధిలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జ్వాలాతోరణం, కార్తీక దీపాలసేవ, శివనామ పారాయణం, మహామంగళ హారతి ఘనంగా జరిగాయి. నగరిలో వెలసిన ప్రసన్నపార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శివుడికి అభిషేకం, చందన అలంకరణ, చేపట్టారు. నెక్కొందిలో అగస్తీశ్వరస్వామికొండపై వెలసిన ప్రసన్న పార్వతీదేవి సమేత అగస్తీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలంలోని శైవక్షేత్రాల్లో బుధవారం శివనామస్మరణతో మారుమోగాయి. మండలంలోని కల్లూరు చంద్రమౌళీశ్వరస్వామి, దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, కావేటిగారిపల్లి, కమ్మపల్లి మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయంతోనే కార్తీకపౌర్ణమి వేడుకలు ప్రాంభమయ్యాయి. స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు.

● **సోమల:** సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి కొండ చుట్టు గిరిప్రదక్షిణకు భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం స్థానిక శివాలయంతోపాటు వెంకటేశ్వరస్వామి పాదాల ఆలయం, వరసిద్ధి వినాయకస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణలో భక్త మండలి సభ్యుల కోలాటం ఆకట్టుకుంది. రాత్రి బంగారు తిరుత్తణి కొండపై కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సోమల, చెన్నయ్యగారిపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె, నడింపల్లె, అడుసుపల్లె తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర అలంకరణలో వైష్ణవిదేవి

● **చౌడేపల్లె:** మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి, నాగభైరవస్వామి, ఆంజనేయస్వామికి ఆలయ నిర్వాహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అర్ధనారీశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

● **పెద్దపంజాణి :** మండల కేంద్రంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, వీరప్పల్లె నందీశ్వరాలయం, కోగిలేరు జలకంఠేశ్వరాలయం, ముత్తుకూరు, చలంగళం సోమేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● **చౌడేపల్లె:** స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు చేపట్టారు. అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుధాకర్‌బాబు కుటుంబ సభ్యులచే అఖండ దీపాన్ని వెలిగించారు.


● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల పట్టణం సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తిశెట్టి శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

● **రొంపిచెర్ల :** రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని కట్టకింద సిద్ధేశ్వరస్వామి శివలింగాన్ని బుధవారం ఉదయం సూర్య కిరణాలు తాకి పలువురిని ఆశ్చర్యపరిచాయి.

● **రామకుప్పం:** రామకుప్పం పట్టణంలోని దేవాలయాల్లో మంగళవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి, శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

వైభవంగా పౌర్ణమి గరుడసేవ

● **పుంగనూరు:** పుంగనూరు టీటీడీ పరిధిలోని వెంకటరమణ ఆలయంలో బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో శ్రీవారికి వైభవంగా గరుడసేవ నిర్వహించారు.





పుంగనూరు: కాశీవిశ్వేశ్వరస్వామి, చౌడేపల్లె: వైష్ణవిదేవి



కల్లూరు: విశేషాలంకరణలో దర్శనమిస్తున్న కాశీవిశ్వేశ్వరుడు



రొంపిచెర్లలో కల్యాణోత్సవంలో పాల్గొన్న చలా రామచంద్రారెడ్డి దంపతులు



బైరెడ్డిపల్లె: కుప్పనపల్లె కాళభైరేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన భక్తులు

నేడు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం

కుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరుగుతుందని ఆర్డీవో శ్రీనివాసరాజు తెలిపారు. మండల స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులకు యూరియా పంపిణీ



గిడ్డపల్లెలో యూరియా పంపిణీ చేస్తున్న శ్రీనాథరెడ్డి

రామకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిడ్డపల్లె గ్రామంలో బుధవారం రైతులకు బందార్లపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి యూరియా పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని రైతులను అన్నివిధాలా ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, మురళీమోహన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

పేదరికంలేని సమాజ స్థాపనే చంద్రబాబు ధ్యేయం

రామకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపన కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కడా పీఏసీ సభ్యుడు రఘు, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు మురళీ తెలిపారు. బుధవారం రామకుప్పం మండలం ముద్దనపల్లెలో ఇంటింటా తిరిగి పీ-4 కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అత్యంత పేదరికంతో బాధపడుతున్న కుటుంబాలను గుర్తించి వారు ఆర్థికంగా ఎదిగేలా పీ-4 కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన లక్ష్మీపతిరాజు



చౌడేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మంగళగిరి టీడీపీ పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ను, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌లను కలిసినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారి దృష్టికి పుంగనూరు నియోజకవర్గంలో కార్యకర్తల అభివృద్ధికి, అక్రమ కేసులు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్, టీడీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

చౌడేపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోసలకురప్పల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో టీడీపీ ప్రభంజనం

విస్తృతంగా చేరికలు



పార్టీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం మొత్తం పసుపుమయం అవుతోంది. ప్రతి ఇంటిపై పసుపు ఎండా ఎగురవేయడానికి గ్రామీణం ఉత్సాహ పడుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోగా పూర్తి స్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే దిశగా నాయకులు తీసుకుంటున్న చర్యలు ఫలితాన్ని ఇస్తున్నాయి. కుటుంబాలకు కుటుంబాలు ప్రతిపక్ష వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నాయి. కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజగోపాల్, ఏపీ ఐబీసీ డైరెక్టర్, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో బుధవారం విస్తృతంగా పార్టీలో చేరికలు జరిగాయి. కుప్పం మండలంలోని ఉర్లవోబనపల్లె గ్రామం నుంచి 50 కుటుంబాలు, మొట్లచేను పంచాయతీ నుంచి 27 కుటుంబాలు కలిసి మొత్తం 77 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కుప్పంలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, రాజగోపాల్, ప్రేమ్ కుమార్ తదితరులు పసుపు కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎటుచూసినా రాష్ట్రంలో టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రభంజనం కనిపిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సామర్థ్యంపై ఉన్న విశ్వాసంతో ప్రజలు తమ భవిష్యత్తుకు నిజమైన భరోసా దక్కిందని ధైర్యంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వారు పూర్తి సంతృప్తితో ఉన్నారని చెప్పారు. సమీప భవిష్యత్తులో వైసీపీ కనుమరుగవుతుందన్నారు. భవిష్యత్తు మొత్తం కూటమి పార్టీలదేనని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా పీఈసీ సభ్యులు సుగుణమ్మ, సతీశ్, రామచంద్ర, మాజీ ఎంపీపీ సాంబశివం, వెడి, శ్రీనివాసులు, శరవణ, జేకే.సంతోశ్, విభూషణ్, వెంకటేశ్, వళ్లియప్ప, కదిరప్ప, విజయ కుమార్, మోహన్, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌ట్రెజరీ అధికారుల తీరుపై నిరసన

పుంగనూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సబ్‌ట్రెజరీ అధికారులు విధులకు రాకుండా అందుబాటులో ఉండటంలేదని విశ్రాంత ఉద్యోగులతో కలిసి బీజేపీ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు మాట్లాడుతూ ఎస్టీవో మహబూబ్‌బాషా రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యాలయానికి వస్తున్నారని ఆరోపించారు. విశ్రాంత ఉద్యోగులు బిల్లుల కోసం వస్తే రూ. 10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విధులకు సక్రమంగా హాజరై ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు.

రోడ్డుపై దుకాణాలతో ట్రాఫిక్



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

పుంగనూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం పట్టణంలోని నాగపాళ్యంమిట్ట, ఇందిరాసర్కిల్ ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించారు. వ్యాపారులు రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయరాదని, అనుమతుల మేరకే దుకాణాలు నిర్వహించుకోవాలని సూచించారు. అతిక్రమించి రోడ్లపైకి వస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలి



పుంగనూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులను వాడి దేశ ఆర్థికాభివృద్ధికి సహకరించాలని పుంగనూరు బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు బుధవారం పుంగనూరులో స్వదేశీ వస్తువులనే వాడాలంటూ బీజేపీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు, నాయకులు ప్రవీణ్‌కుమార్, మనోహర్, వెంకటరెడ్డి, చంద్రరాజు, ప్రసాద్, ఆదినారాయణ, నాగరాజు, ఉమాశంకర్, భార్గవ్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు తమ సత్తా చాటాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం రామకుప్పంలో నిర్వహించిన పార్టీ రామకుప్పం, మణీంద్రం పంచాయతీల సమన్వయ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నో అవరోధాలను అధిగమించి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన పార్టీ శ్రేణులు స్థానిక ఎన్నికల్లో మరోమారు తమ సత్తాచాటాలని కోరారు. సమావేశంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్ రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జీలు రవిరెడ్డి, నాగభూషణం కో-ఇన్‌చార్జీలు కామరాజనాయక్, నవీన్, కడా పీఏసీ సభ్యుడు రఘు, రెస్కో డైరెక్టర్లు విజయ్ కుమార్, మనోహర్, నేతలు రామ్మూర్తి, మూర్తి పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యార్థులకు బస్సు సౌకర్యం



కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కేకే పేట నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గత నెల 31న స్థానిక టీడీపీ నాయకులతో కలిసి రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. తమ నిరసనను అర్జీ రూపంలో ఆర్టీసీ ఉన్నతాధికారులకు వివరించారు. పీలేరు ఆర్టీసీ డీఎం ఎస్ఎండీ రోషన్ ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకొని వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు బుధవారం సాయంత్రం కేకే పేటలో పీలేరు ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. దీంతో ఆర్టీసీ అధికారులను సత్కరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

చిత్తూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో బీవీ రెడ్డి కాలనీ వద్ద పేదలకు బుధవారం మాజీ కౌన్సలర్ పార్థసారథినాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొని 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. నగరంలోని యాచకులకు కూడా దుప్పట్లు అంశారు. ఏటా శీతాకాలంలో తాను దుప్పట్లు పంపిణీ చేస్తుంటున్నట్లు పార్థసారథినాయుడు తెలిపారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

స్వదేశీ వస్తువుల వాడకంతో దేశాభివృద్ధి


స్వదేశీ వస్తువుల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి అందరూ స్వదేశీ వస్తువులనే వాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు రవికుమార్‌లు పిలుపునిచ్చారు. బుధవారం నగర సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం అధ్యక్షతన 28వ డివిజన్‌లోని వీకే ఫంక్షన్ హాలులో ఆత్మ నిర్భర భారత్, ప్రవాసీ యోజన కార్యక్రమంలో నిర్వహించారు. స్వదేశీ వస్తువుల వాడకంతో దేశం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు. బూత్ కమిటీలు తప్పక వేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచకపోతే చర్యలు

పాలసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో తక్కువ మంది పని చేయడంపై డ్వామా పీడీ రవి కుమార్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. గతంలో ఉపాధి పనుల్లో మండలం జిల్లాలో నాల్గవ స్థానంలో ఉండేది. ఇప్పుడు 14వ స్థానానికి తగ్గిపోవడంపై మంగళవారం ప్రభుత్వ విప్ థామస్ మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి డ్వామా పీడీకి ఫోన్ చేశారు. ఈక్రమంలో రవికుమార్ వచ్చారు. ప్రతి పంచాయతీలో రెండు రోజుల్లో కూలీల సంఖ్య పెంచని పక్షంలో సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో సతీష్, ఏపీవో మార్గరేట్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న రవికుమార్

కేబుల్ వైర్లు, స్టార్టర్ల చోరీ

విజయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ మోటారు కేబుళ్లు తరచూ చోరీకి గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల్లో మూడు పర్యాయాలు చోరీ సంఘటనలు జరిగాయి. నిత్యం చోరీ చేస్తున్నా పట్టించుకునేవారు లేరని, స్టార్టర్లు కూడా దొంగతనం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తన పొలంలో రెండు వారాల్లో మూడు సార్లు కేబుల్ చోరీ చేశారని కళియంబాకంలో వేణుగోపాల్ చెప్పారు. ఈవిషయమై పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బురద రోడ్డులో ఇబ్బందులు


అధ్వానంగా తయారైన పుల్లూరు రోడ్డు

శ్రీరంగరాజపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీవర్షాలకు మండలంలో గ్రామీణ రోడ్డు బురదమయంగా తయారయ్యాయి. పుల్లూరు, ఎగువకమ్మకండ్రిగ, రాణిపురం, దిగువ కమ్మకండ్రిగ, రోడ్డు దారుణంగా ఉన్నాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల దుస్థితిపై ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **పాలసముద్రం:** సింహరాజుపురం నుంచి వినాయకపురం వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో తమిళనాడులోని అమ్మియార్‌కుప్పంకు వెళ్లే ప్రయాణికులకు దూరం తగ్గుతుంది. దీంతో ఈ మార్గంలో పాలసముద్రం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల ప్రజలు ఎక్కువగా ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల భారీ వర్షాలకు రోడ్డు గుంతలమయమై ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాన్ని తారు రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో చోరుల గుర్తింపు :డీఎస్పీ

విజయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దుకాణ యజమానులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ పేర్కొన్నారు. బుధవారం పన్నూరు సబ్ స్టేషన్‌లో దుకాణదారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. దొంగల బారి నుండి తప్పించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దుకాణం ఆవరణలో, లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, షాపుల్లో పెద్ద మొత్తంలో నగదు నిల్వ ఉంచకూడదని సూచించారు. సీసీ కెమెరాల సాయంతో దొంగల్ని గుర్తించవచ్చన్నారు. సీఐ భాస్కర్, ఎస్ఐ మహేష్‌బాబు, ఏఎస్ఐ గోవిందరాజులు, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

విద్యుత్ వినియోగదారుల అర్జీల పరిష్కారం

చిత్తూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేలో 99 శాతం సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తున్నామని ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర చెప్పారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టిన నాటి నుంచి చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో 135 అర్జీలు రాగ అందులో 123 అర్జీలు పరిష్కరించామన్నారు. బిల్లులు చెల్లింపునకు డిజిటల్ పద్ధతిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర సూచించారు. బుధవారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై ఆరోగ్యంతో పాటు ఆ కుటుంబం కూడా రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన శక్తియాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర సమయాల్లో వినియోగించుకోవాలన్నారు. క్రైమ్ సీఐ ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఫేక్ ఫోన్‌కాల్స్ వస్తే 1930కి ఫోన్ చేయాలని కోరారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మంత్రి నారా లోకేశ్‌తో పంచాయతీ రాజ్ ప్రతినిధులు భేటీ


మంత్రి లోకేశ్‌ను కలిసిన పంచాయతీరాజ్ చాంబర్ నేతలు

విజయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేష్‌ను జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, పంచాయతీ రాజ్ ప్రతినిధులు బుధవారం కలిశారు. అమరావతి సచివాలయంలో వాకె స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సమస్యల గురించి ఆయనకు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, గోగునేని వసుధ, రాష్ట్ర కార్యదర్శి యలవర్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

శ్రీరంగరాజపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దొంగతనాల కేసులో ఓ నిందితుడ్ని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు ఇటీవల గంగమ్మగుడి వద్ద ఓ ఇంట్లో తిరువళ్ళూరు జిల్లా మనాలి గ్రామానికి చెందిన సుందర్రాజు బంగారాన్ని, నగదును చోరీ చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం చెన్నై వెళ్లిన పోలీసులు నిందితుడ్ని పట్టుకుని రూ.5వేల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.


నిందితుని అరెస్టు చూపుతున్న ఎస్ఐ

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్


స్వామి సేవలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ

ఐరాల(కాణిపాకం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డవెంకట్రావు కుటుంబ సమేతంగా బుధవారం కాణిపాకం వరసిద్ధుడ్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో పెంచలకిషోర్, ఆలయ చైర్మన్ మణినాయుడు ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానతరం వారిని వేదమంత్రాలతో ఆహ్వానించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. ఎమ్మెల్యే గురజాలజగన్మోహన్ ఆయన వెంట ఉన్నారు. అంతకుముందు ఆయన్ను ఎమ్మెల్యే మురళీమోహన్ కలిశారు. కాగా స్వామిని మాజీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ దర్శించుకున్నారు. ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



ఐరాల(కాణిపాకం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో బుధవారం సత్యనారాయణస్వామి వ్రతాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకంను నిర్వహించాక స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సత్యనారాణస్వామి చిత్రపటాన్ని ఉంచిభక్తుల చేత సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు నడిపేటప్పుడు భద్రం సుమా

నగరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల బస్సుల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ పేర్కొన్నారు. నగరి పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం నిర్వహించిన డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్‌లె మాట్లాడుతూ లేదా మద్యం సేవించి బస్సు నడపరాదన్నారు. విధిగా యూనిఫాం ధరించాలని, పిల్లలను బస్సులు దింపేటప్పుడు, ఎక్కించుకునేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు పూర్తిగా పరిశీలించాకే వెళ్లాలన్నారు. సమావేశంలో సీఐ విక్రమ్, ఎస్ఐ నాయక్, ఏఎస్ఐ ఏసయ్య, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

చిత్తూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఉంచిన ద్విచక్రవాహనాన్ని దొంగిలించిన వైనమిది. ఎత్తు సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. నగరంలోని ఈశ్వరుని గుడివీధిలో సుధాకర్ ఆచ్చారి కుటుంబం నివాసముంది. ద్విచక్ర వాహనాన్ని ఇంటి వద్ద ఉంచి లోనికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వాహనం కనపడలేదు. దాంతో వాహనం దొంగతనానికి గురైందని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుంతలో పడి ఇద్దరికి గాయాలు

చిత్తూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంతలో పడి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గత నెల 30వ తేదీన ప్రమాదాలకు నిలయంగా గుంతలు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. కన్నన్‌కాలేజీ రోడ్డులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో సువేరా హౌస్‌క్రాస్ రోడ్డులో నీటి పైప్‌లైన్ కోసం గుంతలు తవ్విన నగరపాలక అధికారులు సక్రమంగా పూడ్చకుండా వదిలేశారు. బుధవారం ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వస్తుండగా అదే గుంతలో పడిపోయారు. ఈ ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి.


గాయపడిన వ్యక్తి

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు




చిత్తూరు కాశీ విశ్వేశ్వరాలయంలో దీపారాధన-అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో హోమం- కొండ మల్లీశ్వరస్వామి కల్యాణోత్సవం

చిత్తూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిట లాడాయి.. బుధవారం వేకువజామునుంచే మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించడానికి తరలి వచ్చారు. సాయంత్రం కూడా క్యూ కట్టారు. నగరంలోని అగస్తీశ్వరాలయం, గిరింపేటలోని శివగామి సుందరి అమ్మ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయం, సంతపేటలోని రాజుగుడి (కాశీవిశ్వేశ్వరాలయం), జ్యోతిర్లింగేశ్వరాలయం, కట్టమంచిలోని కులందేశ్వరాలయం, ఇరువారంలోని నాగేశ్వరాలయం తదితర ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు

వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలోని జ్ఞానప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి దీపోత్సవం జరిగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆరు గంటలకు కొండమల్లీశ్వరుడికి పంచామృత రుద్రాభిషేకం చేశారు. శివపార్వతుల కల్యాణోత్సవానికి, కార్తీక మహాదీపం కార్యక్రమంలో ఎక్కువ మంది భక్తులు పాల్గొన్నారు.


చిత్తూరు అగస్తీశ్వరాలయంలో మహిళల పూజలు

తవణంపల్లె: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు., సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

పాలసముద్రం: శ్రీబొమ్మరాజుపురంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో రుద్రాభిషేకం, హోమాన్ని నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. **నిండ్ర:** కూనమరాజుపాళెంలోని మహాలక్ష్మీ దేవస్థానంలో బుధవారం శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. . లక్ష్మీనారాయణుల ఊంజల్‌సేవ నిర్వహించి సత్యనారాయణ వ్రతం జరిపారు.

సంకరజాతి పేయదూడల ప్రదర్శన


దూడల ప్రదర్శనలో పాల్గొన్న పాడిరైతులు

గంగాధరనెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడిఆవులు పెంపకం ద్వారా పాలదిగుబడి విక్రయాలతో పాటు సంకరజాతి దూడల వల్ల ఆర్థికాభివృద్ధి చెందవచ్చునని జిల్లా వెటర్నరీశాఖ జేడీ ఉమామహేశ్వరి సూచించారు. వెజ్జుపల్లె గ్రామంలో పలువురు పాడిరైతులకు చెందిన సంకరజాతి పేయ దూడల ప్రదర్శన బుధవారం జరిగింది. కార్యక్రమంలో చిత్తూరు, పుత్తూరు వెటర్నరీశాఖ డీడీలు డాక్టర్ వాసు, డాక్టర్ గోవిందయ్య, ఏడీ డాక్టర్ మురళీమోహన్, పలువురు వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయ శిక్షణ

పెనుమూరు, నవంబరు(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షణ అధికారి నాంచారమ్మ అన్నారు.ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల శిక్షణలో భాగంగా చార్వాగానిపల్లి క్లస్టర్‌లోని రైతు పొలాలను బుధవారం ఆమె సందర్శించారు. ఏటీఎం. ఏగ్రేడ్ నమూనాలు విత్తనాల ఎంపిక, జీవామృతం, బీజామృతం, విత్తన శుద్ధి విధానాలను ప్రత్యక్షంగా చూపించి వివరించారు. కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, సుధాకర్ నాయుడు, గురుప్రసాద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు


రైతులకు అవగాహన కల్పిస్తున్న నాంచారమ్మ

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నగరి, నవంబరు 5(ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని బాధితులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందజేశారు. 15 మందికి రూ.5,37,107 మేర చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పుత్తూరు మున్సిపాలిటీ మిద్దిగుంటలో చాముండేశ్వరికి రూ.25 వేలు, రెండో వార్డులో సుగుణకు రూ.24800, నిండ్రలో డేవిడ్‌కు రూ.10 వేలు, చింతలపట్టెడకు చెందిన రాజేంద్రకు రూ.14,321, సుభద్రకు రూ.35541, పుదుపేటకు చెందిన దేవికి రూ.40,112, పుష్పకు రూ.60 వేలు, శ్రీనివాసన్‌కు రూ.74995, సావిత్రికి రూ.25 వేలు టీడీపీ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

గుడిపాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, ఆరణిశ్రీనివాసులు అన్నారు. బుధవారం చిలాపల్లు క్రాస్ నుంచి గుడిపాల వరకు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జనసేన నాయకుడు శశికాంత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పార్టీలో సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. విభేదాలు లేకుండా ఉండాలని సూచించారు. నియోజకవర్గ పీవోసీ ఆరణికవిత, కడియాలపుష్ప, ఉయ్యాలశ్రీనివాస్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు దయారామ్, యశ్వంత్,రమేష్ పాల్గొన్నారు.


జనసేన జెండాను ఆవిష్కరించిన హరిప్రసాద్, ఎమ్మెల్యేలు జగన్మోహన్, శ్రీనివాసులు

రాష్ట్ర స్థాయి పోటీలకు నిండ్ర విద్యార్థి

నిండ్ర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నిండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.వసంత్ హైజంప్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. శ్రీకాకుళంలో శుక్రవారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఈ విద్యార్థి ఎంపిక అయ్యాడని హెచ్‌ఎం వి.శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు జ్ఞానకుమార్‌లు తెలిపారు. ఈ విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.


ఎస్.వసంత్

ట్రాన్స్‌కో సీఎండీతో ఎమ్మెల్యే భేటీ

నగరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరి, నిండ్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేటలో సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసే అంశంపై తిరుపతిలో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్‌ని బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కలసి చర్చించారు. విజయపురం మండలంలోని కోసలనగరంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అంతరాయం లేకుండా చూడాలని ఆయన కోరారు.

ఈ-ఆటోల ప్రారంభం

గుడిపాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఈ-ఆటోలను ఎమ్మెల్యే గురజాల జగన్మోన్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతపూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, మాజీ ఎమ్మెల్యే ఏఎస్. మనోహర్, సింగిల్ విండో చైర్మన్ ప్రతాప్‌నాయుడు, నాయకులు బాలాజీనాయుడు, హేమాద్రినాయుడు, అనిల్‌కుమార్, రమాదేవి, స్వామినాథ్‌గౌడ్, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవం

నగరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కరియమాణిక్య స్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి దేవేరుల ఉత్సవ విగ్రహాలను తులసిమాలతో అలంకరించి అభిషేకం చేశారు. అభిషేకానంతరం కరియమాణిక్యస్వామికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పట్టు వస్త్రాలతోను, పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీనేత కుటుంబానికి పరామర్శ


మునస్వామి చిత్రాపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీనేతలు

శ్రీరంగరాజపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పుల్లూరు టీడీపీనేత వెంకటేష్ తండ్రి వంక మునస్వామికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, టీడీపీనేతలు బుధవారం నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మునస్వామి చిత్ర పటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ చైర్మన్ కృష్ణమ్మ నాయుడు, శ్రీధర్ యాదవ్, మోహన్‌రాజ్, భాస్కర్ నాయుడు, వేమ నాయుడు, సిద్దయ్యశెట్టి,, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి బదిలీ?

పెనుమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మోరవకండ్రిగ పంచాయతీ సెక్రటరీని బదిలీ చేయాలని కలెక్టర్ ఎంపీడీవోకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే మందలించినా అదే తీరు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో బుధవారం కలెక్టర్ ఎంపీడీవోతో మాట్లాడారు. సచివాలయానికి సకాలంలో రాని వారిపై చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. సదరు కార్యదర్శిని బదిలీ చేయాలని చెప్పినట్లు తెలిసింది.

డ్రైవర్లకు అవగాహన

వెదురుకుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని ఆటో, బస్సు, ఇతర వాహనాల డ్రైవర్లకు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ట్రైనీ ఎస్ఐ రమేష్ సూచించారు. బుధవారం కార్వేటినగరంలో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు నియమ నిబంధనలను వారికి వివరించారు.

సబ్‌ట్రెజరీ అధికారుల తీరుపై నిరసన

పుంగనూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సబ్‌ట్రెజరీ అధికారులు విధులకు రాకుండా అందుబాటులో ఉండటంలేదని విశ్రాంత ఉద్యోగులతో కలిసి బీజేపీ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు మాట్లాడుతూ ఎస్టీవో మహబూబ్‌బాషా రోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యాలయానికి వస్తున్నారని ఆరోపించారు. విశ్రాంత ఉద్యోగులు బిల్లుల కోసం వస్తే రూ. 10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని వాపోయారు.

భారీ వర్షం కురిస్తే రాకపోకలకు నరకమే..!

ఐరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసి వాగులు,వంకలు పొంగితే ఐరాలవాసులకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. బీరప్ప చెరువు వద్ద నుంచి సాగే గార్గేయ నది ఐరాల మీదుగా రెండు చోట్ల కలుస్తుంది. గార్గేయ నది కలిసే ఈ రెండు ప్రాంతాలు రహదారిపై సాగుతుంది. సుమారు 15 ఏళ్ల క్రితం వీఎస్ అగ్రహారం వద్ద పెద్ద వంతెనను నిర్మించడంతో కొంత సమస్య తీరింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద, రెడ్డివారిపల్లె వద్ద సాగే వంకకు నేల వంతెనల వల్ల వర్షాలొచ్చినప్పుడల్లా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా ఈ ప్రాంతాల్లో పెద్ద వంతెనలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.




రెడ్డివారిపల్లె వద్ద ఇబ్బందులు- తహసీల్దార్ కార్యాలయం వద్ద బంద్ అయిన రాకపోకలు